వడదెబ్బపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 5: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు వడదెబ్బకు గురికాకుండా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ దాసరి హరిచందన సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేడిమి సంబంధ వ్యాధులపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఇప్పుడే 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైతున్న నేపథ్యంలో వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజలు బయటికి వెళ్లినప్పుడు శరీరం ఎండ వేడిమి తగలకుండా టోపీ ధరించాలని శరీరం నుంచి చెమట ఎక్కువగా పోవడం, వాంతులు, విరేచనాలు వంటివి సంభవిస్తే తక్షణమే ముందు జాగ్రత్త చర్యగా డాక్టర్ దగ్గరికి వెళ్లాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేసే వారి కోసం తాగునీరు నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోక సభ ఎన్నికలు మే నెలలో నిర్వహిస్తున్నందున ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలు ఉష్ణోగ్రతల కారణంగా ఇబ్బందులు పడకుండా టెంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులపై దృష్టి సారించాలి

జిల్లా సంక్షేమ శాఖ అధికారులు అందరూ వారి వారి పరిధిలోని సంక్షేమ హాస్టళ్లకు వెళ్లి పిల్లలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన తీసుకురావాలన్నారు. అంతకుముందు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు మాట్లాడుతూ వడదెబ్బకు గురైన వారికి ప్రథమ చికిత్సగా ఇచ్చేందుకు ప్రతి ఆశ వర్కర్ దగ్గర 50, ఏఎన్‌ఎం వద్ద 100, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో2000 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి. పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేటి దీక్షను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, రవీంద్రకుమార్

మిర్యాలగూడ, ఏప్రిల్ 5 : సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం అందించడంతోపాటు, పండించిన వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలోశనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న దీక్షకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో తాగునీరు అందక ప్రజలు అల్లాడుతున్నారని, ప్రభుత్వం కనీసం ప్రజలకు తాగునీటికి అందించలేని దుస్థితిలో ఉందని పేర్కొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టబోయే దీక్షకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, రైతు, మహిళ, కార్మిక, యువజన, విద్యార్థి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాల అధ్యక్షులు, నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సత్యగ్రహ దీక్ష

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 5 : రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్‌వద్ద శనివారం రైతు సత్యగ్రహం దీక్ష నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరువు వల్ల పంట నష్టం పోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు అందజేయాలని పేర్కొన్నారు. రైతు సత్యగ్రహం దీక్షలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

కొండమల్లేపల్లి : ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 5 : పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యజ్ఞ నారాయణ మాట్లాడుతూ ఐదు నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడ లేద వాపోయారు.ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందజేయాలని కోరారు. కోట్ల సతీశ్, లక్ష్మణ్, సాలమ్మ, భారతమ్మ, మధు, బక్కయ్య, అలివేలు, మంగమ్మ పాల్గొన్నారు.

సీతారామాంజనేయ ఆలయ కార్యవర్గం

చిట్యాల, ఏప్రిల్ 5 : మండలంలోని పిట్టంపల్లి సీతారామాంజనేయ ఆలయ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా తుమ్మల వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా అందె మారయ్య, ప్రధాన కార్యదర్శిగా సింగిరెడ్డి అనంతరెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి గోపిరెడ్డి, కార్యదర్శిగా చిర్రగోని వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దేవరపల్లి సత్తిరెడ్డి, మాజీ సర్పంచు ఈసం బాబు, మెట్టు పరమేశ్, సామ రాంరెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

FLAT FOR SALE
★Ready to move: 3BHK Flats for Sale, 1900 Sft. @ Medipally Near Warangal Highway. Contact: 6300623310, 6302061711.
NT-717

WANTED
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

PLOT FOR SALE
★HMDA Approved Affordable Plots for Sale Near AIIMS, Bibi Nagar, 160 to 200 Sq.yds. Contact: 6300623310, 6302061711.
NT-720

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | తుంగతుర్తి : 9182777638

కుంభం మీటింగ్‌కు సీనియర్లు డుమ్మా

- మున్సిపల్ చైర్మన్ మినహా అంతా గైర్హాజరు
- మరోసారి బయటపడిన అంతర్గత విభేదాలు
- నేతల మధ్య కుదరని సమన్వయం
- ఇంకా వొడువని పదవుల పంచాయితీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ ప్రెస్‌మీట్ పెడితే ఆ పార్టీ నేతలు పట్టుమని పది మంది కూడా హాజరుకాలేదు. మున్సిపల్ చైర్మన్ మినహా కీలక నేతలంతా డుమ్మా కొట్టడం కాంగ్రెస్‌లోని అంతర్గత పోరును మరోసారి బయట పెట్టింది. ఇప్పుడిది స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడ బహిరంగ సభ నేపథ్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జిల్లాకేంద్రంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ నిర్మల, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ మినహా పట్టణంలోని ఆ పార్టీ ముఖ్య నేతలెవరూ హాజరు కాలేదు. సీనియర్లు పోత్నక్ ప్రమోద్, బర్రె జహంగీర్, తంగళ్లపల్లి రవికుమార్‌తోపాటు ఒక్క కౌన్సిలర్ కూడా రాలేదు. ఇటీవల ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టణంలో ఏర్పాటు ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌కూ ఆయనకు దగ్గరుగా ఉండే నేతలు మాత్రమే హాజరయ్యారు. కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అనుచరులుగా పేరున్న వారెవరూ రాకపోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.

వొడువని పదవుల పంచాయితీ..

భువనగిరితో కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరికి వారు గ్రూపులుగా విడిపోయారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు ముందు విభేదాలున్నా అంతా కలిసి పనిచేశారు. చైర్మన్ ఎన్నిక తర్వాత సీన్ మారింది. ఎమ్మెల్యే కుంభాన్ని వ్యతిరేకిస్తూ ఓ వర్గమే తయారైంది. చైర్మన్ పదవి ఆశించి భంగపడిన వారు ఇంకా అసంతృప్తిలోనే ఉన్నారు. వైస్ చైర్మన్ పదవిని సైతం ఏకగ్రీవంగా బీజేపీకి కట్టబెట్టడంపై గుర్రుగా ఉన్నారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వలేదని..

ఎన్నికల షెడ్యూల్‌కు ముందే రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను ప్రకటించింది. జిల్లాతోపాటు భువనగిరి నియోజకవర్గం నుంచి పలువురు నేతలు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులను ఆశించారు. ఎన్నికల ముందు ఆశ చూపినా, ఒక్కరికీ పదవి దక్కలేదు. ఇందుకు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కారణమంటూ వారంతా అసంతృప్తిగా ఉన్నారు. ఏండ్ల తరబడి పార్టీ కోసం పని చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు.

చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి

- కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి అర్జిత్ గోపాల్

భూదాన్ పోచంపల్లిలో ఇక్కత్ పట్టు చీరెలను పరిశీలిస్తున్న ఫైనాన్స్ అడ్వైజరీ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ అర్జిత్ గోపాల్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 5 : చేనేత కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటానని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి, ఫైనాన్స్ అడ్వైజరీ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ అర్జిత్ గోపాల్ అన్నారు. భూదాన్ పోంచపల్లి పట్టణ కేంద్రంలో శుక్రవారం చేనేత కళాకారుల గృహాన్ని సందర్శించి వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. టూరిజం పార్క్‌లోని ఆచార్య వినోబా భావే, వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలను, భూదానోద్యమానికి సంబంధించిన ఘట్టాలను సందర్శించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వారసత్వ చేనేత కల అద్భుతమని కళాకారుల నైపుణ్యాన్ని ఆయన కొనియాడారు. టై అండ్ డై చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, వినియోగదారుల అభిరుచుల మేరకు వస్త్రాలను నాణ్యంగా, నవ్యత డిజైన్లతో రూపొందించడం పట్ల అందరినీ ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఆయన వెంట టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, చేనేత జిల్లా నాయకుడు తడక రమేశ్, చేనేత నాయకులు కర్నాటి బాలరాజు, ముసుకూరి నరసింహ, మెరుగు శశికళ, అంకం పాండు, సీత లక్ష్మణ్ పాల్గొన్నారు.

నరేంద్రమోదీ, అమిత్‌షా జోడితోనే దేశం అధోగతి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 5 : నరేంద్ర మోదీ,అమిత్‌షా జోడీతోనే దేశం అధోగతి పాలైందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం వికసిత్ భారత్ పేరుతో ప్రజలను బురిడి కొట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. వ్యవసాయరంగం సంక్షోభంలో ఉన్నంత కాలం భారతదేశం సంక్షోభంలో ఉంటుందని విశ్లేకులు అంటున్న మాటలను గుర్తుచేస్తున్నానన్నారు. 400 సీట్ల సాధిస్తామని చెబుతున్నా బీజేపీ నాయకులు ఆంధ్ర ప్రదేశ్‌లో టీడీపీ, జనసేనతో, బిహార్‌లో ములాయం సింగ్‌తో వంటి ప్రాంతీయ పార్టీలతో జతకట్టే పరిస్థితి ఎందుకు వస్తుందని నిలదీశారు. దేవుడి పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్నారని, ఢిల్లీ ముఖ్యమంత్రిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. ఉత్తరాదిలో బలహీనపడ్డారని, దక్షిణాదిలో ఆదరించే పరిస్థితి లేదన్నారు. ప్రజలు బీజేపీ మాయమాటలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌రాష్ట్ర నాయకులు దైద రవీందర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, వెంకన్న, కొండయ్య, సుకన్య, నరేందర్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ చర్లపల్లి కార్యవర్గం ఎన్నిక

చర్లపల్లిలో నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ జాతీయ నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 5: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని వాసవీక్లబ్ చర్లపల్లి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా క్లబ్ జాతీయ నేతలు యామ దయాకర్, చిత్ర రవిచంద్రన్, రాచర్ల కమలాకర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక కాగా ఎన్నిక అనంతరం చర్లపల్లిలోనే నూతన సంఘ భవనాన్ని ప్రారంభించి నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం అధ్యక్షులుగా ఇమ్మడి వర ప్రసాద్ ఎన్నిక కాగా కార్యదర్శిగా విజయ్ కుమార్, కోశాదికారిగా కొండూరు తేజ, క్లబ్ సభ్యులుగా ఎనిమది మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రెసిడెంట్ గజవెల్లి సత్తయ్య, కార్యదర్శి బిక్కుమల్ల రవీందర్, కోశాధికారి గజవెల్లి యాదయ్యలతో పాటు క్లబ్ పూర్వ సభ్యులు, జిల్లా ఐపీసీ, ఐఈసీ, ఆర్సీ, జెడ్‌సీ, వివిధ క్లబ్ సభ్యుల అధ్యక్షులు కార్యదర్శులు కోశాధికారులు, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్ర ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ బాధ్యులు

చిట్యాల, ఏప్రిల్ 5 : కెనరా బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వట్టిమర్తి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను, స్వామి, నాయకులు మల్లయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

నేడు మోత్కూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మోత్కూరు, ఏప్రిల్ 5 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హూస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల కొత్త విద్యుత్ స్తంభాలకు తీగలు లాగేందుకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఆయా సమయాల్లో విద్యుత్ నిలిపి వేతకు సహకరించాలని కోరారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

చిట్యాల, ఏప్రిల్ 5 : భద్రాచలం సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలను టీఎస్ ఆర్‌టీసీ లాజిస్టిక్స్ సేవల ద్వారా ఇంటి వద్దకే అందజేస్తున్నట్లు నార్కట్‌పల్లి డిపో ఇన్‌చార్జి డీఎం రామ్మోహన్ రెడ్డి, మార్కెట్ ఎగ్జిక్యూటివ్ యాదయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.151లు చెల్లించి ఆర్‌టీసీ కార్గోలో బుక్ చేసుకుంటే తలంబ్రాలను ఇంటి వద్దకే తీసుకువచ్చి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు : తాసీల్దార్

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 5 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని తాసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ తరుణ్, ఏఈఓ విజయలక్ష్మి, వెంకటయ్య, రైతులు వెంకట్ రెడ్డి, నర్సిరెడ్డి, నరేశ్, దామోదర్ రెడ్డి, నగేశ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండరూరల్, ఏప్రిల్ 5 : మండలంలోని సపావట్‌తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని సబావట్‌తండాలో కొండల్ ఇంట్లో సోదా చేయగా అక్రమంగా, తరలించేందుకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కొండల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్యాల, ఏప్రిల్ 5 : గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు బీ.మధు అన్నారు. గుండ్రాంపల్లి గ్రామంలో ఏసిరెడ్డి శ్రీరాంరెడ్డి, ఏసిరెడ్డి కృపాకర్‌రెడ్డిల జ్ఞాపకార్థం చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయం, అమెరికా తెలుగు అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్నిశుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజల సౌకర్యార్థం ఈ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు, అవసరమైన వారికి అక్కడే ఈ నెల 8 నుంచి ఉచిత కంటి శుక్ల శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు వివరించారు.కార్యక్రమంలో డాక్టర్ అరుణకుమార్, ఆట సభ్యులు కరుణాకర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, శ్రీధర్, వైద్యులు శంకర్, అభిదత్, అభిశిక్త పాల్గొన్నారు.

గుట్టలో రసాభాసగా కాంగ్రెస్ సన్నాహక సమావేశం

యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిని నిలదీస్తున్న సీనియర్ నాయకుడు పెలిమెల్లి చిన్న వెంకటేశ్‌గౌడ్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 5 : తుక్కుగూడలో నిర్వహించే జనజాతర సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మండల పార్టీ, పట్టణ అధ్యక్షులపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడ్డ తమకు పార్టీ కార్యక్రమాలపై ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి గౌడ్‌ను పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిట్ట రాంచందర్‌గౌడ్, పెల్లిమెల్లి చిన్న వెంకటేశ్, గుండ్లపల్లి కరుణాకర్‌గౌడ్ నిలదీశారు. ఒకరినొకరు దూషించుకునే ప్రయత్నం చేశారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గెలుపు కోసం ఎంతో కృషి చేశామని, కానీ అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్తగా వచ్చిన నాయకులకు ప్రాధాన్యమిచ్చి తమను పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలో కనిపించిన తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులకు తాము కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్‌గౌడ్ హామీతో నిరసనను విరమించుకున్నారు.

ఈ నెల 7న ఉగాది కవి సమ్మేళనం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 5 : ఈ నెల 7న శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు రాయగిరి సోమా రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు భువనభారతి, జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం నర్సింహారెడ్డి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, మెరుగు సదానందం, బండారు జయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త ఎన్. గోపి, పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య, డాక్టర్ పెసర వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ ఎన్ చారి, డాక్టర్ కస్తూరి లక్ష్మీనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సద్ది వెంకట్‌రెడ్డి, సోమ సీతారాములు, గడ్డం నరసింహారెడ్డి, పెండెం సత్యనారాయణ, డాక్టర్ చల్లా జయశ్రీలకు జీవన సాఫల్య పురస్కారాలు, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, పాలకుర్తి రామమూర్తి, బండి రాజుల శంకర్, గుడిపల్లి వీరారెడ్డి, పెసరు లింగారెడ్డి, గుమిడెల్లి వెంకన్న, వాకిటి రాంరెడ్డి, వల్లాల విజయలక్ష్మి, మోటె సత్తయ్యకు సాహిత్య సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయిలో నిర్వహించనున్న కవి సమ్మేళనంలో ఉత్తమంగా నిలిచిన మొదటి మూడు కవితలకు అమ్మయాది పెండెం ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నగదు పురస్కారాలు అందజేస్తున్నామని, కవులు, కవయిత్రులు, సాహిత్యాభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మినా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్ మేళా

జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు.

మిర్యాలగూడ, ఏప్రిల్ 5: పట్టణంలోని మినా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన జన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించారు. కంపెనీ హెచ్‌ఆర్ రిక్విటర్ మంగులాల్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలో 41 మంది కళాశాల విద్యార్థినులు ఉద్యోగ ప్రక్రియకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ షహలాబుతుల్ ఎంపికైన విద్యార్థినులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎండీ.మహమ్మద్‌అలీ ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ వాణి, టాస్క్ కోఆర్డినేటర్ ఫయాజ్, రమేశ్, మహేశ్, పూజా, భారతి, కరుణాక్ పాల్గొన్నారు.

నీళ్లతో చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీర్చాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

సాగర్ ఎడమకాల్వను పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

వేములపల్లి, ఏప్రిల్ 5: సాగర్ ఎడమ కాల్వ నీటితో చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సాగర్